
నూరేళ్ళ తెలుగు కథకు

నవ్య నీరాజనం - 60



# నేటి రచయితలు ఎవరికి వారు బందీలు

**- బి.ఎస్.రాములు**

సామాజిక తత్వవేత్త, సుప్రసిద్ధ రచయిత బి.ఎస్.రాములు 150కి పైగా కథలు రాశారు. సుమారు 50 పుస్తకాలు వెలువరించారు. కథకులకు వర్క్ షాపులు నిర్వహిస్తున్నారు. 'బి.ఎస్.రాములు విశాల సాహితి' పురస్కారాలను ఏటా అందిస్తున్నారు. అనేక పుస్తకాలకు సంపాదకులుగా వ్యవహరించారు. ప్రజా ఉద్యమాలలో పని చేశారు. బాల్యం నుంచీ అనేక కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ వెనుకబడ్డ ప్రజల చైతన్యమే ధ్యేయంగా రచనలు సాగిస్తున్న బి.ఎస్.రాములు గారితో ఇంటర్వ్యూ ఈవారం..

### మా అమ్మ బతుకే ఓ పోరాటం

బతుకంత ఏడ్పు ముచ్చట్లే కద. 23 ఆగస్టు 1949న కరీంనగర్ జిల్లాలోని జగిత్యాలలో పద్మశాలి కుటుంబంలో పుట్టాను. బేతి లక్ష్మిరాజు, మిట్టపల్లి నారాయణ గారు మా తల్లిదండ్రులు. నేను ద్వితీయ సంతానం. మా తండ్రి బొంబాయి బట్టలమిల్లు కార్మికుడు. నా ఆరోయేట మా తండ్రి మరణించాడు. మా అమ్మ బీడీ కార్మికురాలిగా మమ్మల్ని పెంచి పోషించింది. పోరాటం ఎక్కడో లేదు, బతుకులోనే ఉండాది. ఒక స్థాయి బతుకు బతకడమే ఒక పోరాటంగా సాధించుకోవాల్సిన జీవితాలు మావి. మా అమ్మ బతుకే ఓ పోరాటం.

### ప్రతి స్కూల్లోను సోషలిస్టు సమాజం ఉండేది

సాతాని అయ్యోరి పంతులు వద్ద బాలశిక్ష చదివాను. మేం స్వాతంత్ర్యానంతరం పుట్టిన పిల్లలం. ప్రతి స్కూల్లోను సోషలిజం ఉండేది. ఇప్పట్లా అప్పట్లో ప్రయివేటు స్కూళ్ళు లేవు. తహసిల్దార్ కొడుకులు, టీచర్ల కొడుకులు మాతోటి చదువుకునే వాళ్ళు. స్కూల్లో పిల్లల మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు ఉండేవి కావు. కులాలు మతాలు అనే ఫీలింగ్స్ ఉండేవి కావు. తొలి సోషలిస్టు సమాజాన్ని మేం అనుభవించాం. తల్లిదండ్రులు లేని పిల్లలకు 'పూర్ ఫండ్' పేరుతో పుస్తకాలు ఇచ్చేవారు. ఒకసారి స్కూల్లో 'పూర్ ఫండ్ ఇస్తారు. నిలబడండి' అన్నారు. తల్లికాని, తండ్రి కాని లేని పిల్లలు లేచి నిలుచున్నారు. నన్నూ లేచి నిలబడమన్నారు. అది నాకవమానంగా అనిపించింది. సహాయం పేరుతో పిల్లలను హింసించడం అంటే ఇదే! పేదరికం అనుభవించే వారికి తెలియదు. పేదవాడు ఎప్పుడూ పేదవాణ్ణి అనుకోడు. ఎదుటివాడి చూపులను బట్టి, మాటలను బట్టి తాను పేదవాడిననుకుంటాడు.

### ఇంట్లో అన్ని పనులు చేసేవాణ్ణి

నా ఆరో ఏట తండ్రి చనిపోవడంతో అమ్మ బీడీలు చేసి మమ్మల్ను పెంచి పోషించింది. నేను చదువుకోవాలంటే అమ్మ చెప్పిన పనులు చేయాలె. అమ్మకు బీడీలు చేసేదాంట్లో సాయం చేసిన. బావి నుంచి నీళ్ళు చేదేవాణ్ణి, సున్నాలు వేసేవాణ్ణి, పేడ తీసేవాణ్ణి, శుక్రవారం అలకడం.. ఇలా ఇంట్లో అన్ని పనులు చేసేవాణ్ణి. పని చేయడంలో చాలా ఆనందం ఉండేది. జగిత్యాల పట్టణం అయినప్పటికీ చుట్టూ పరిసరాలు చెట్టూచేమతో అద్భుతంగా ఉండేవి. రోడ్లవెంట మామిడిచెట్లు, అల్లనేరేడు చెట్లు ఉండేవి. వాటికి మేం ఎగబడేవాళ్ళం. చిలక కొట్టిన పండ్లు మబ్బున్నే ఎవరూ చూడకముందే పోయి తెచ్చుకుని తినేవాళ్ళం.

### మా కష్టం మాకు దక్కలే!

నాలుగోతరగతి నుంచి నేను ఆటల్లో ఫస్టు. స్కూల్లో నాదెప్పుడూ ఫస్టు బెంచీయే. మాది ప్రైమరీ స్కూలు. స్కూలు స్థలం చాలా ఉంది. అందుల కూరగాయల తోట వేశాం. ఒక్కో క్లాసుకు ఒక్కోమడి. తోట పని మేమే చేశాం.


కుటుంబ సభ్యులతో....


భార్య శ్యామలతో...

మొక్కలు పెరిగినయి. పంటకొచ్చినయి. మస్తుగా పండినయి. వాటిని టీచర్లు కోయించి మార్కెట్లో అమ్మారు. మాకు ఇవ్వలే. మేం కష్టం చేసినం. ఫలితం మాకు దక్కలే.

### మా జనరేషన్ చేసుకున్న అదృష్టం..

నేను జగిత్యాల హైస్కూలుల చదువుకున్న. మా కాలంలో(1964-66) తెలంగాణలో అత్యధికంగా పిల్లలున్న స్కూలు అదే! 2000 మంది విద్యార్థులున్నరు. 68 మంది టీచర్లున్నరు. మాకు ముద్దురామకృష్ణయ్య అనే టీచరుండె. ఆయన ప్రపంచమంతా చుట్టి వచ్చి అవన్నీ మాకు చెప్పిండు. ఆధునిక విద్య ఆయన ప్రారంభం చేసిండు. ప్రతి క్లాసుకు మైకు ఉండేది. విద్యార్థులు ఫెయిల్ అయితే టీచర్లనే అడిగేవాడు. విద్యార్థులను కొట్టకూడదనేవాడు. స్కూల్లో స్విమ్మింగ్ పూల్ కట్టించుండు. క్రికెట్‌ను దేశీయ ఆటగా మార్చి 'తీన్ కూట' ఆటగా మార్చిండు. పిల్లల వ్యక్తిత్వ వికాసానికి ఆయన బాగా కృషి చేసిండు. మా జనరేషన్ చేసుకున్న అదృష్టం అది. స్కూల్లో అన్నీ ఇంప్లిమెంటు చేసిండు. ఇప్పటికీ ప్రభుత్వాలు ఇంకా అమలు చేయడం లేదు.

### 15 రూపాయలు ఫీజు కట్టలేక..

అన్న చదువు సరిగా సాగలేదు. అన్న బట్టల మిల్లు కార్మికునిగా బొంబాయి వెళ్ళిపోయాడు. 1967లో ఎస్ఎస్ఎల్‌సి ఫస్టుక్లాసులో పాస్ అయ్యాను. నాకేమొ బిపిసి, ఎంపిసి చదవాలని ఉండె. వాటికి 15 రూపాయలు ల్యాబ్ ఫీజు కట్టాలె. ఫీజు కట్టలేక అమ్మ చదువు బంద్ చేయమన్నది. ఫీజు అడగని చదువు కామర్స్. దాంతో నేను సిఇసిలోకి వచ్చా. అప్పట్లోనే చాలా నవలలు చదివాను. రవీంద్రనాథటాగూరు, శరత్‌లను చదివాను. చెదలు తిన్నెట్టు పుస్తకాల్ని తిని పడేసిన. సాహిత్యం చదువుతూ అందులో ఉండే మంచే గెలుస్తుందనే ఆదర్శంతో జీవిస్తూ వచ్చాను.

### పోస్టల్‌ల ఉద్యోగం రాలె

నాకు ఎస్ఎస్ఎల్‌సిలో 64 శాతం మార్కులు వచ్చాయి. 53 కటాఫ్ మార్కులతో పోస్టల్‌లో ఉద్యోగం వచ్చేది. అయితే నాకంత వయసు లేదు. 1969ల జైతెలంగాణ వచ్చింది. మాస్ కాపీయింగ్ ఎక్కువగ జరిగింది. అప్పుడు పోస్టల్‌లో 83 శాతం కటాఫ్ పెట్టారు. నాకు పోస్టల్‌ల ఉద్యోగం రాలె. అప్పట్లో మూడు నెల్లకోసారి ఎంప్లాయిమెంట్ రెన్యువల్ చేయించాలి. ఎంప్లాయిమెంట్ ఆఫీసు కరీంనగర్‌ల ఉండె. అక్కడకు పోవాలంటే రూపాయి అర్వై పైసలు ఖర్చు. నేను ఎంప్లాయిమెంట్ రెన్యువల్ చేయించలె.

### సైకిళ్ళ ఊర్లకు తిరిగి పేపర్లు వేసేవాణ్ణి

ధర్మపురిలో ప్రాచ్య కళాశాల ఉండె. అక్కడ డిఓఎల్, బిఓఎల్. చదివిన. అక్కడే ఉండి న్యూస్ పేపర్ ఏజెన్సీ తీసుకున్న. 1970 నుంచి 75 వరకు ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి మొదలు అన్ని దినపత్రికలూ తెప్పించిన. చందమామ, బాలమిత్ర కూడా తెప్పించిన. రోజూ డైలీ పేపర్ ఒంటిగంటకు వస్తాది. సైకిళ్ల

ఊర్లకు తిరిగి పేపర్లు వేసి ఇంటికి వచ్చేప్పటికి సాయంత్రం ఐదుగంటలయితది. అలసిపోయే టోణ్ణి. పార్ట్ టైమ్ బీడీ కంపెనీల పనిచేస్తి.

### వాళ్ళు పైసలు ఇచ్చేవారు కాదు

ధర్మపురి పండిత బ్రాహ్మణులు ఉండే ఊరు. ధర్మపురికి దిన, వార, మాసపత్రికలు పరిచయం చేసింది నేనే! ధర్మపురి చుట్టూతా 40 పల్లెలు ఉంటాయి. అయితే పేపర్ ఏజెన్సీ పెట్టాక పోస్టల్ రన్నర్‌తో దొరలకు పేపర్ పంపేవాడిని. వాళ్ళు పైసలు ఇచ్చేవారు కాదు. ఆర్నెళ్ళకోసారి సైకిల్లో వాళ్ళ ఊర్లకు పోయి పేపర్ డబ్బులకు బదులుగా వడ్లు కొలుచుకొచ్చేవాణ్ణి. గణపతిలక్ష్మణరావు నా క్లాస్‌మేట్. స్టూడెంట్‌గా ఉన్న నాటికే అతనికి పేదలు, ధనికులు అనే భావన కలిగింది. తరచూ ఆ విషయాలు చెప్పేవాడు.

### పిల్లలను తీసకచ్చి స్కూళ్ళో జాయిన్ చేసిన

డివోఎల్ చదువుతోటి ఆదిలాబాద్‌లో తెలుగు పండిట్‌గా సెలెక్ట్ అయిన. 300 రూపాయలు లంచం కట్టాలె. ఉద్యోగం రాలె. 1973లో శ్యామలతో పెళ్ళయింది. 1975లో హాస్టల్ వార్డెన్‌గా ఉద్యోగం వచ్చింది. పిల్లలకు కేటాయించే బడ్జెట్ తక్కువ ఉంటుంది. పిల్లల ఆకలేమో ఎక్కువుంటుంది. బిచ్చగాళ్ళకు ఇచ్చినట్టు ఇచ్చేవారు. ఆ డబ్బు పిల్లలకు సరిపోయేది కాదు. పిల్లల్లో ఉండే అసంతృప్తికి, స్థానిక రాజకీయనాయకులతోటి తరచూ చర్చలు, గొడవలు ఉండేవి. దళితులకు పిల్లలను స్కూళ్ళకు పంపాలంటే భయం. దొర ఏమంటడో, సర్పంచ్ ఏమంటడో అనేవారు. నేను సైకిల్లో ఊరూరు తిరిగి పిల్లలను తీసకచ్చి స్కూల్లో జాయిన్ చేసిన. కరీంనగర్ జిల్లాలో వార్డెనర్ల సంఘం ఏర్పాటు చేశాం. 'సంఘమిత్ర' అనే పత్రిక తెచ్చాను. 'తెలంగాణ వార్డెన్స్ అసోసియేషన్' పెట్టాను. ఇవన్నీ భరించలేక అధికారులు నన్ను సస్పెండ్ చేశారు.

### ఆ పైసలతోనే చందమామ కొన్నా


మా అమ్మ కథలు బాగా చెప్పేది. అన్న, నేను రోజూ కథలు చెప్పించుకునేటోళ్ళం. దోమలు, నల్లులు, తిండిలేకపోవడం, పేదరికం కూడా అమ్మ కథలుగా చెప్పేది. ఎంత రాత్రయినా మేం ఊఁ..ఊఁ.. అని ఊకొట్టెటోళ్ళం. ఆఖరికి అమ్మకు విసుగొచ్చేది. 'కథకు కాళ్ళు లేవు. ముంతకు చెవుల్లేవు' పడుకోండి అనేది. అప్పుడు పడుకునేవాళ్ళం. నాకు 5 వతరగతినుంచి సాహిత్యం అంటే ఆసక్తి. మా ఊరిలో లైబ్రరీ ఉండేది. అక్కడ చందమామ, బాలమిత్ర, డిటెక్టివ్ పుస్తకాలు, కవిత్వం దొరికేవి. 1964 నుంచి పద్యాలు రాసేవాణ్ణి. 1967లో మొదటి కథ 'జగిత్యాల కథ' రాసిన. అది బాలమిత్రలో వచ్చింది. మా తాతయ్య మబ్బుతాన నన్ను లేపేవాడు. బేరం పోయేవాడు. నన్ను చూసి పోతే బేరం మంచిగవుతుందని ఆయన నమ్మకం. నాకు రోజుకో పైస ఇచ్చేవాడు. ఆ పైసలు కూడబెట్టి 'చందమామ' కొనేది. అందులో మహాకవి 'భారవి' కథ చదివిన. చాలా నచ్చింది.

### ఆ కథల్లో మా జీవితాలు ఉండేవి కావు

బాధల గురించి కథలు రాయడం అనేది తెలిసేది కాదు. అప్పట్లో కథకులు పేదల జీవితాలను కథలుగా రాసేవారు కాదు. అంతా హాయిగా బతికేవాళ్ళ కథలుండేవి. వాళ్ళ అందమైన కష్టాలుండేవి. అవి నిజ జీవితంలో మాకుండేవి కావు. 1962 నుంచి ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికలో సీరియల్స్ చదివేవాడిని. వాటిల్లో మా జీవితాలు ఉండేవి కావు. నేను 1977లో విప్లవ భావజాలంలోకి వచ్చేశాను. జనశక్తి రాజన్న, వేములపల్లి వెంకట్రామయ్య మా ఇంట్లో శిక్షణ తరగతులు నిర్వహించేవారు. ఈ తరగతులకు మల్లేపల్లి లక్ష్మయ్య కూడా అటెండ్ అయ్యాడు. నేను కథలు పేదల గురించి, నాకన్నా చాలా పేదల గురించి రాయాలనుకున్న. రైతాంగం గురించి, ఫారెస్ట్ వాళ్ళ చేతిలో బాధపడే గొల్లలపైన కథలు రాసిన. దాదాపు 150 కథలు రాసిన. అన్నీ దొరకట్లేదు. అప్పుడు కాపాడుకోవాలనే ధ్యాస ఉండేది కాదు. 7 కథల సంపుటాలు, బీడీ కార్మికులపై రాసిన 'బతుకు పోరు' నవల పుస్తకాలు వచ్చాయి.

### రచయితలు కంపార్ట్‌మెంటలైజేషన్ అయిపోతున్నరు

ఇప్పటి కథలన్నీ చదవడం సాధ్యం కావడం లేదు. కొన్ని చక్కటి కథలు వస్తున్నాయి. చాలా కథల్లో లోపం ఏంటంటే కథను చదివించే నేర్పు, రీడబులిటీ తగ్గుతోంది. ముఖ్యంగా ప్రజాపక్షం వహించి రాసేవాళ్ళలో ఈ లోపం కనిపిస్తున్నది. కేవలం కష్టాలే ఏకరువు పెట్టటం కథ కాదు. కష్టాల్లో ఉన్నవారికి, జీవితం గెలవాలనే మార్గదర్శకత్వం ఉండేలా కథలు ఉండాలి. రకరకాల కారణాల వల్ల ఇప్పుడన్నీ రిపోర్టింగ్ కథలు వస్తున్నాయి. ప్రజల పక్షం వహించి రాసేవాళ్ళు కంపార్ట్‌మెంటలైజేషన్ అయి



పి.వి.నరసింహారావు, తదితరులతో...

పోతున్నారు. స్త్రీ వాద, దళిత, తెలంగాణ వాద, మైనారిటీ వాదాల గురించి మాత్రమే రాస్తున్నారు. ఇదొక రకమైన కులవాతావరణం. రచయిత విశ్వమానవుడు. అందరి జీవితాలను ఆవిష్కరించాలి. అస్థిత్వ వాద ఉద్యమాలు రచయితలను కుదించి వేశాయి. పూర్వం రచన ద్వారా రచనకు గుర్తింపు ఉండేది. ఇప్పుడు రచయిత పేరు కనిపిస్తుంది గానీ, రచన మిగలడం లేదు. సాహిత్యం వ్యక్తి కేంద్రంగా మారిపోయింది. సాహిత్యాన్ని వ్యక్తులుగా గుర్తుంచుకుంటున్నాం గానీ, కథలుగా అవి గుర్తుండడం లేదు.

### 5 శాతం కూడా రచయితలు పట్టుకోవడం లేదు

ఇప్పటి రచయితలు అధ్యయనం పెంచుకోవాల్సి ఉంది. తమకు తాము బందీలయిపోయారు. గ్లోబలైజేషన్‌తో ఈ సమాజం చాలా వైరుధ్యాలతో ముందుకు సాగుతోంది. ఇందులో 5 శాతం కూడా ఇప్పటి రచయితలు పట్టుకోవడం లేదు. పూర్వం కథలు, నవలలు సినిమాలుగా వచ్చాయి. ఇప్పుడెందుకు అలాంటి రచనలు రావడం లేదు? సమాజ పరిణామాలు, సంస్కృతి ప్రతిబింబించే కథలు రావాలి.

**–సుంకోజి దేవేంద్రాచారి**

## నచ్చినవి

| | |
|---|---|
| రచయిత | : ప్రేంచంద్ |
| నవల | : రంగభూమి |
| కవి | : మహాకవి వేమన |
| పాట | : నీలి మేఘాలలో గాలి కెరటాలలో |
| సినిమా | : స్లమ్‌డాగ్ మిలియనీర్ |
| నటి | : స్మితాపాటిల్ |
| నటుడు | : కాంతారావ్ (బాల్యపు ముద్ర) |
| గాయని | : లతామంగేష్కర్ |
| గాయకుడు | : కిషోర్ కుమార్ |
| వ్యక్తి | : అన్నాహజారే |
| వంట | : చపాతి, మాంసం |

నాకు నచ్చిన నా కథ

# వారసత్వం

- బి.ఎస్.రాములు

**“ఆ పల్లెటూరి సంబంధం నేను చేసుకోను. ఎవర్ని చేసుకుంటే బాగుంటుందో మందితో చెప్పించుకోవడానికి నేను చిన్నపిల్లను కాను. గ్రూప్ వన్ లేదా లెక్చరర్ ఉద్యోగం దొరికే దాకా పెళ్ళి వద్దంటే వినరేం! జీవితం పట్ల ఎవరి అవగాహన వారికుంటుంది. మీకున్నంత అనుభవం లేకపోవచ్చు. టీచరు ఉద్యోగం చేస్తున్నాను. మూడు వందల మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులను డీల్ చేస్తున్నాను. నేను పని చేస్తున్నది కూడా పల్లెటూరి బడిలోనే కదా! పల్లెటూరి మనస్తత్వాలు నాకు తెలియవా?”**

**ఎమ్మెస్సీ, యం.ఫిల్. బి.ఈడి చేసిన గోల్డుమెడలిస్టు కిరణ్మయికి కోపం దుఃఖం జమిలిగా వస్తోంది. తన వినయమే తన భవిష్యత్తును ముంచిందని వెక్కివెక్కి ఏడ్చింది. రాత్రి నిద్రపోయినట్టు లేదు. ఈ సంబంధం ఎలా వదిలించుకోవాలో తెలియక సతమతమై నిరాశలో కూరుకుపోయింది కిరణ్మయి.**

**“అమ్మా! వాళ్లు మీకు అంతదగ్గరి పాత చుట్టాలైతే జగిత్యాల సంబంధం అని నాన్న నిన్ను చేసుకునే బదులు ఆ పల్లెటూరి మేనసంబంధం చేసుకోవాల్సింది. నలభయి ఏళ్ళక్రితమే నాన్నకు పనికిరాని మేన సంబంధాలు నాకెందుకు”.**

వంటగిన్నెలు తోముతున్న కిరణ్మయి తల్లి లక్ష్మీబాయి చకితురాలైంది. ముసలి అత్తామామల మూర్ఖత్వం వల్ల యింతదూరం వచ్చిందని తిట్టుకుంది. కిరణ్మయి తండ్రి రాజేశం కరీంనగర్ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నాడు. ముసలి తల్లిదండ్రుల కోసం కుటుంబాన్ని కోరుట్లలో ఉంచి వారానికోసారి కరీంనగర్ నుండి వస్తుంటాడు. రాజేశంకు ముగ్గురు పిల్లలు: కడగొట్టు పిల్లకావడంతో కిరణ్మయి గారాబంగా పెరిగింది. పెద్దకొడుకు ముంబైలో ఏదో కంపెనీలో పని చేస్తున్నాడు. షోలాపూర్ అమ్మాయిని పెళ్ళి చేసుకుని యింటికి రావడం తగ్గించాడు. రెండో కొడుకు హైద్రాబాద్‌లో సెటిలయ్యాడు. విదేశాలకు వెళ్ళే ఆలోచనలో ఉన్నాడు.

“తాతయ్యా! పల్లెల మీద ఇన్నాళ్ళు లేని ప్రేమ మీకు యిప్పుడే గుర్తొచ్చిందా! నిజంగా పల్లెలమీద మీకు ప్రేమ ఉంటే ఈ బిల్డింగ్ అమ్మేసి పల్లెల్లో సెటిల్‌కండి. ముగ్గురు చెల్లెండ్లున్న వాన్ని చేసుకొని నేను సుఖపడేదేముంటుంది. ఇద్దరి సంపాదనా వాళ్ళ పెళ్ళిళ్ళకు, ప్రసూతులకే చాలవు. నేనీ సంబంధం చేసుకోకపోతే మీరు చచ్చేదైతే ఇప్పుడే చావండి. ఇంకో ఏడాది రెండేళ్ళు బతికే మీ ముసలివాళ్ళ కోసం నా నిండు జీవితం బలి కావాలా! ఇది నిజంగా ప్రేమేనా! ఇది ప్రేమకాదు. వెనకట్నించి మీరు సాగించుకున్న పెద్దరికం. అహంకారం. నా మీద నిజంగా ప్రేముంటే నేను కులాంతార మతాంతర వివాహం చేసుకున్నా ఆశీర్వదిస్తారు. అట్లా అని నేను ఎవరితోనే లేచిపోవడం లేదు. నేను గనక ప్రేమిస్తే యింటికే తీసుకువచ్చి పరిచయం చేస్తాను. వదినెల్ని అన్నయ్యలే సెలెక్టు చేసుకున్నప్పుడు లేని అభ్యంతరం నాకే ఎందుకు”.

మనుమరాలు అరిచి అరిచి అదే ఊర్కుంటుందని గంగరాజం తాత, లింగమ్మ నానమ్మ నోరు తెరవలేదు. ఏమీ మాట్లాడకపోయేసరికి కిరణ్మయికి మరింత కోపంగా ఉంది.

“తాతయ్యా! నువ్వేదో పెద్ద స్వాతంత్ర పోరాటం చేసానని గర్వం నీకు. నిన్ను నువ్వు ప్రేమించుకున్న స్వార్థం తప్ప నువ్వు నిజంగా ప్రజల్ని ప్రేమించిందెప్పుడు. ఎప్పుడో చేసిన దాన్ని చెప్పుకొని అంతకు ఎన్నోరెట్లు మీరే సుఖాలనుభవించారు. మీ పచ్చిస్వార్థం వల్లనే అక్కడే ఆగి పోయారు. మీరింకా పోరాటం చేసి ఉంటే సమాజం యింకా ఎదిగి ఉండేది. సర్‌పంచ్ పదవే నీకు గొప్పదైపోయింది. ఎమ్మెల్లేవో, యం.పీ.వో. ఎందుకు కాలేదు. నీ స్వార్థం కోసం కాకపోతే పల్లెల్లో ఉన్నదంతా అమ్ముకొని కోరుట్లలో ఎందుకు సెటిల్ అవుతావు. తద్వారా పల్లె సమాజం ముప్పయి ఏళ్ళు వెనక్కి పోలేదా!”

కిరణ్మయి కళ్ళు తుడుచుకుంది. ముఖంపై నీళ్ళు చల్లుకుని రెడీ అయింది. వేడివేడి అన్నం కాస్తంత పళ్లెంలో తెచ్చింది లక్ష్మీబాయి. గబగబా అన్నం తింటూ అంది.

“అమ్మా! యివాళనే పోయి వాళ్ళకు చెప్పిరండి. అమ్మాయి మెచ్చలేదని. రేపు పూలు పండ్లు (నిశ్చితార్థం) పెట్టడానికి రావద్దని. తాతయ్యా! నానమ్మా! ఒప్పించింది మీరే కాబట్టి మీరే పోయి చెప్పిరండి” అంటూ చేయి కడుక్కొని టిఫిన్ బాక్సు బ్యాగులో వేసుకుని బయటకు నడిచింది. “బస్సు మిస్సయితే లీవు పోతుంది” అంటూ బడికి బయల్దేరింది. గంట సేపు కురిసిన తుఫాను వర్షం హోరు అకస్మాత్తుగా వెలసినట్టయింది.

బింకంగా స్కూలుకు వెళ్ళినా కిరణ్మయి ఆ సంబంధం క్యాన్సిల్ కాకపోతే ఎలా అనే చింతతో సరిగ్గా పాఠాలు చెప్పలేక పోయింది.


కిరణ్మయి బయటికి నడిచాక లక్ష్మీబాయి ముసలివాళ్ళకు భోజనం వడ్డించి వెంటనే బయల్దేరదీసింది. “ఇంకా నయం. పెండ్లి పత్రికలు అచ్చేసినంక ఇట్ల చేస్తే ఇజ్జతుపోయేది. ఎంత చెప్పినా మీ మాట మీదేనాయె”.

గంగరాజం, లింగమ్మలకు అంత ఉదయాన్నే తినబుద్ధి కాలేదు. పైగా మనమరాలు అకస్మాత్తుగా కురిపించిన తుఫాను వర్షం వారి హృదయాల్లో గింగిర్లెత్తాయి. కాస్త తిన్నామనిపించుకుని తయారై బస్సెక్కారు వాళ్ళు.

***

గంగరాజం, లింగమ్మల దాంపత్యాన్ని చూసి పూర్వం పార్వతీ పరమేశ్వరులు అని మెచ్చుకునేవారు. గంగరాజంకిప్పుడు ఎనభయి ఏళ్లు. లింగమ్మకు డెబ్బయి అయిదు. లింగమ్మకు గంగరాజంతో పెళ్లయినప్పుడు ఏడేళ్లుంటాయి. అరవై ఏళ్ల వాళ్లు భార్యాభర్తలు. వారు ఒకరులేకుండా మరొకరు ఊహించుకోవడం కొడుకు

## సామాజిక పరిణామాలను..



*70 సంవత్సరాల కాలంలో సామాజిక పరిణామాలు, జీవితాల్లో మార్పు ఎలా ఉంది అనే విషయాన్ని కథగా మలచాలనుకున్నాను. ఆనాటి విశేషాలు తెలుసుకోవడం కోసం 15 రోజులపాటు 20 మందిని ఇంటర్వ్యూ చేశాను. తెలంగాణ ప్రాంతంలోని విద్యావ్యవస్థ, గ్లోబలైజేషన్ ప్రభావం, సామాజిక పరిణామాలను 'వారసత్వం' కథగా మలచాను.*

**-బి.ఎస్.రాములు**
**9391036987**

రాజేశంకు గానీ, కోడలు లక్ష్మీబాయికి గానీ, తెల్సినవారికి గానీ సాధ్యమయ్యేది కాదు. ఈ మధ్య ఎవరు ముందుపోతారో అని చింతపట్టుకుంది. నేను ముందు పోత. నువ్వు లేకపోతే నేను ఒంటరిగా బతకలేను అన్నాడు గంగరాజం. నేను ముందు పోతే మంచిగుండు అని వాదిస్తుంది లింగమ్మ.

''అది ఎన్ని అన్నదో విన్నావా!'' అని బస్సు గరగరలో కదిపాడు గంగరాజం, సానుభూతి ఆశించి.

''అది అన్నదాన్లో తప్పేముంది. నేను మొదట్నుంచి చెప్తనే ఉన్న. బలవంతంగా ఒప్పియ్యకు అని. దానికన్నీ నీ బుద్ధులే వచ్చినై''.

లింగమ్మ మాటతో గంగరాజం మనస్సు చివుక్కుమంది. అన్ని మాటలన్న మనమరాల్ని వెనకేసుకోవడం, తనతో పోల్చడం చాలా బాధేసింది.

''నేను పెద్దోల్ల మీదికి యిట్లా మర్రపడ్డనా! (ఎదురు తిరిగానా!) ఇన్ని మాటలన్నానా!''

''నువ్వు మర్రవడలేదా! దొరలతో పెట్టుకోవద్దు అని మీ నాయిన చెప్తే వింటివా! ఈ బాంచె బతుకులు మీరు బతికింది సాలు. సాతంత్రం అచ్చింది. అందరం సమానమే. వాడు ఎవనికి దొర. ఇంట్లో ఉండుమంటే ఉంట. వేరుపడుమంటే పడుత. కాని నాకు పిరికిమందు నూరి పొయ్యకుర్రి. వాని బతుకెంత. ఊరోల్లందరు ఊస్తె కొట్టుకపోతది – అని ఎదిరించలేదా!'' లింగమ్మ ముడుతలు పడ్డ మొహంలో కాస్త నవ్వు విరిసింది.

లింగమ్మ మాటల్తో గంగరాజం జ్ఞాపకాలు అరవై ఏళ్లు వెనక్కి మళ్ళాయి. జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్ల, మెట్‌పల్లిలో జరిగిన ఆంధ్ర మహాసభల మీటింగులకు వెళ్ళడంతో తన అవగాహనే మారిపోయింది.

బూర్గుల రామకృష్ణారావు, స్వామి రామానందతీర్థ, సురవరం ప్రతాప రెడ్డి, మాడపాటి హన్మంతరావు, గుంటుక నర్సయ్య పంతులు, ఎక్కలదేవి లక్ష్మణ, గంగుల భూమయ్య, వట్టికోట ఆళ్వారుస్వామి, కె.వి.రంగారెడ్డి, చెన్నరాజ గంగారాం, కాసం శివరాజు గుప్త, బద్దం ఎల్లారెడ్డి, బుట్టి రాజారాం, అంబల్ల రాజారాం, సోషలిస్టు తిరుమలరావు వంటి ఎందరో ఆంధ్ర మహాసభ ఉద్యమంలో పరిచయమైనారో.

అంతదాకా ప్రపంచం అంటే తన పల్లెనే అనుకున్నాడు. ఈ పల్లెను మించిన ప్రపంచం ఉంది. ఈ దొరలను మించిన రాజ్యం ఉంది. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం ఉంది. సోషలిస్టు రష్యా ఉంది. ఆంధ్ర మహాసభ ఉంది. కాంగ్రెస్ ఉంది. గాంధీ ఉన్నాడు. గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా పంచిన పుస్తకాలెన్నో చదివాడు. జగిత్యాలకు పోయినప్పుడల్లా గోలకొండ పత్రికలన్నీ తిరగేసేవాడు.

1922లోనే నిజాం నవాబు వెట్టిచాకిరీ రద్దుచేస్తూ ఫర్మానా (జీ.వో) జారీ చేసినా దొరల వెట్టి తప్పలేదు. పన్నుల వసూలు కోసం ప్రభుత్వ నిర్వహణ కోసం దొరల మీద, ధనికుల మీద ఆధారపడ్డం వల్ల అంతా చుట్టుకు వచ్చింది. ఉన్నత కులాల్లో పుట్టిన ఉన్నత వంశాల వారిని, ధనికులను ఉద్యోగాల్లో పెట్టుకుంటే డబ్బుకోసం కక్కుర్తి పడరని నిజాం ఆశించాడు. కాని వాళ్ళే ఎక్కువ దోచారు. ప్రజల్ని పీడించడానికి అధికారం, కులం, ధనం అన్నీ తోడయ్యాయి. ప్రజల్ని పీడించి, వెట్టి చేయించుకొని మరిన్ని సుఖాలకు మరిగి సోమరిపోతులయ్యారు. దాంతో నైజాం రాష్ట్రం బాగా వెనకబడిపోయింది. వారి ద్వారా నిజాం ప్రభుత్వం ఎంతో అప్రదిష్ట పాలైంది. పేదల్లోకు ఉద్యోగాలిస్తే అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి భయపడుతూ పని చేసే వారు. ఇన్ని ఘోరాలు జరిగేవి కాదు, నిజాంకు ఆ సలహా యిచ్చిందెవరో. అంబేద్కర్‌ను ప్రిన్సిపల్ సెక్రెటరీగా తీసుకుందామనుకున్న నిజాంను పక్కదోవ పట్టించిందీ వారే కావొచ్చు.

గంగరాజం అమ్మమ్మగారిల్లయిన జగిత్యాల్లో ఉండి కొంతకాలం చదువుకున్నాడు. జగిత్యాల్లో 1927 నాటికే నిజాం ప్రభుత్వం స్థాపించిన హైస్కూలుండేది. గంగరాజం చదువుకున్నప్పుడు ఒక బెంగాలీ బెనర్జీ ఆ స్కూలు ప్రధానోపాధ్యాయుడుగా ఉండేవాడు. అతను 1905 నాటి బెంగాల్ విభజన వ్యతిరేక, వందేమాతరం ఉద్యమాన్ని దగ్గరగా చూసిన వాడు. అతడు దేశమంతటా సాగుతున్న జాతీయోద్యమాల గురించి నమ్మకస్థులైన ఉపాధ్యాయులకు విద్యార్థులకు అప్పుడప్పుడు చెప్తుండే వాడు. అలా విన్నవారిలో గంగరాజం ఒకడు.

అప్పుడు అవేవీ గంగరాజం తలకెక్కేవి కాదు. కాని విన్నందుకు అవి ఊరకే పోలేదు. దేశమంతటా సాగుతున్న సంస్కరణ ఉద్యమాల గురించి, గాంధీ గురించి, సుభాష్ చంద్రబోస్ గురించి, జాతీయోద్యమం గురించి వింటుంటే ఏదో ఉత్తేజంగా ఉండేది. కాని అప్పుడు చేనేత మగ్గం నేస్తూ చదువుకుంటే సమయం ఎక్కువ దొరికేది కాదు. చదువైపోయాక కూడా మగ్గం గుంట ఎటూ కదలనీయకుండా కుదేసింది. ఎటూ కదల నీయని వృత్తిని వదిలి వ్యవసాయంలో దిగాడు గంగరాజం.

బొంబాయికి పోయిన గంగరాజం చిన్నాన్న చిన్నలింగం అక్కన్నించి పైసలతోపాటు బొంబాయి సంస్కృతినీ వెంటతెచ్చాడు. అందమైన మస్లిన్ ధోవతులు, చక్కని మెత్తని చెప్పులు, సారంగ వాయిద్యం, కోటు, ఖాదీ టోపీ, మార్వాడీ నల్లటోపీ మొదలైనవి వెంటతెచ్చాడు. అంతమంచి బట్టలు ఆ వూరి తుక్కారావు దొరకు కూడా ఉండేవి కావు. తుక్కారావు దొరకు గంగరాజం తండ్రి నేసిచ్చినవే మంచి బట్టలు.

బొంబాయి బట్టల మిల్లులో పనిచేసి వచ్చి ఇంత భూమి కొనుక్కొని అటు చేనేత మగ్గం, ఇటు వ్యవసాయం అని మొదలెట్టడంతో తుక్కారావుకూ, గంగరాజం తండ్రి లింగయ్యకూ మధ్య తగాదా మొదలైంది. అటు చేనేత, ఇటు వ్యవసాయం, మరో కొడుకు బొంబాయి మిల్లు సంపాదన చూసి తుక్కారావు ఓర్వలేకపోయాడు.

ఎండాకాలంలో చెరువు పూడిక తీయడంలో దొరకున్న భూముల పాలు మేరకు పూడికకు కూలీ కట్టియ్యాలని లింగయ్య వాదించాడు. జనం సంగం కట్టారు. ఆ సమయంలో పుట్టిన గంగరాజం చెల్లెలుకు సంగమ్మ అని పేరు పెట్టుకున్నారు. ఆంధ్ర మహాసభలోని కమ్యూనిష్టులు లింగయ్యకు మద్దతు యిచ్చారు.

గంగరాజం చిన్నాన్న చిన్నలింగం బొంబాయి ట్రేడ్ యూనియన్ చైతన్యంతో బాగా చురుకుగా ఉండేవాడు. పెరడుకుపోయి వస్తున్నప్పుడు చిన్నాన్నను ఎవరో కొట్టిచంపారు. కేసు తనమీద పడకుండా తహసీలు దారుకు, పోలీసులకు, పోలీసు పటేలుకు ఏదో ముట్టచెప్పాడు తుక్కారావు.

దాంతో గంగరాజం తండ్రి లింగం కొంచెం వెనక్కి తగ్గాడు. కాని సంగాలు నడుస్తూనే ఉన్నాయి. టౌన్లల్లో సభలకు పోయి వస్తూనే ఉన్నారు.

గంగరాజంతో లక్ష్మీబాయి కాపురానికి వచ్చేనాటికి చిన్నాన్నపోయిన భయం యింకా తగ్గలేదు. చిన్నాన్నలా కాకూడదని భయం భయంగా ముందుకు కదిలాడు గంగరాజం. భయం తేలిపోయింది. అటు ఆంధ్ర మహాసభ. ఇటు ఆర్య సమాజం.

దొరల ద్వారా, దొరల చెప్పుచేతల్లో ఉండే కులపెద్దల ద్వారా జరిగే అన్యాయాలు, వెట్టి, కుల బహిష్కరణ, సాంఘిక బహిష్కరణ భరించలేక ఎందరో క్రైస్తవం, ఇస్లాం పుచ్చుకున్నారు. వాళ్ళను శుద్ధిచేసి కులం లోకి, వెట్టిలోకి రమ్మనడానికి తప్ప అర్య సమాజం తమకు చేసిందేమీ లేదని గంగరాజం గ్రహించాడు. చిన్నాన్న పిల్లలు తురక మతం పుచ్చుకొని ఊళ్ళోంచి వెళ్ళిపోయారు.

ఎట్లా మొదలైందో ఎందుకు మొదలైందో తెలియదుగానీ దొరలతో నైజాంతో తుపాకుల పోరాటం మొదలైంది. దాంతో ఊళ్లో ఉన్నవాళ్ళు పారిపోవాల్సి వచ్చింది. ఆ తర్వాత దొరలు పారిపోయారు. పల్లెల వదిలి పట్నాల్లో సంపాదించడం మొదలెట్టారు.

రజాకార్లు మొదలయ్యాక మానభంగాలు, దోపిడీలు, నరుకుడు, ఊళ్ళకు ఊళ్ళు తగలబెట్టడం వాళ్ళ నిత్యకృత్యాలయ్యాయి. ఎక్కడా రక్షణలేని స్థితిలో గంగరాజం జగిత్యాల అమ్మమ్మ గారింట్లో మలేరియా జ్వరంతో తలదాచుకున్నాడు. రజాకార్ల రూపంలో వచ్చి తుక్కారావు దొరను చంపి కూతుర్ని మానభంగం చేసి చంపి పారిపోయిన వారిలో గంగరాజం చిన్నాన్న కొడుకులున్నారని ఊరంతా గుప్పుమంది.

జగిత్యాల్లో యింకా ఘోరంగా ఉంది. ఎప్పుడు ప్రాణంపోతుందో తెలియదు. కొందరు అరబ్బులతో కల్సి స్థానిక ముస్లింలు ఆయుధాలతో ఊరేగింపు తీశారు. ధనవంతుల్ని హత్యచేసి వారి ధనాన్ని, యిళ్ళను, ఆడవాళ్ళను ఎవరెవరు ఎలా పంచుకోవాలో ఒప్పందాలన్నీ పూర్తయి పోయాయి. తెలంగాణా అంతటా అన్ని ఊళ్ళల్లో యివేపథకాలు. హిందువులు కూడా ఆయుధాలతో ఊరేగింపులు తీశారు. రహస్యంగా ఎత్తులకు పైఎత్తులు సాగుతున్నాయి. లింగమ్మ జ్వరంతో ఉన్న గంగ రాజంకు సేవలుచేస్తూ పక్కనే ఉన్నప్పటికీ గజగజ వణికిపోయేది. అనుకున్నంతా అయింది. గంగరాజం ఉన్న యింటికి రాత్రి సందుల్లో పడి ఏదో పని మీద పోయి వస్తుంటే ఎవరో కోన్ హై అంటూ గద్దించే సరికి లింగమ్మ భయపడిపోయింది. ఉర్దూ రాని లింగమ్మ తెలుగులో మాట్లాడేసరికి అయిదారుగురు రజాకార్లు ఒక్కసారిగా చుట్టుముట్టారు. ఎక్కడికి ఎత్తుకుపోయారో తెలియదు ఎంత మంది రేప్‌చేశారో తెలియదు. రెండో రోజు అకస్మాత్తుగా ఆ యిల్లు నిర్మానుష్యమైపోయింది.



సైనిక చర్య జరిగింది. రజాకార్లు ఎక్కడెక్కడో పారిపోయారు. సైన్యం రావడం మూడు రోజులు ఆలస్యం అయితే రజాకార్ల హత్యాకాండతో వందల మంది ఊచ కోత మానభంగాలతో ఊరంతా రక్తసిక్తమయ్యేది. లింగమ్మ బతికేది కాదు. రజా కార్ల యిళ్ళల్లోకి చొరబడ్డ రాగెల్ల లచ్చన్న లింగమ్మను గుర్తుపట్టి నలుగురు కల్సి మోసుకుని గంగరాజం యింటికి చేర్చడంతో లింగమ్మ మళ్ళీ పుట్టినట్టయింది. ఏడాదిదాకా మనిషి కాలేదు. ఆ తర్వాత గర్భస్రావమై లింగమ్మకు యిక పిల్లలు కాలేదు.

జ్వరంతో ఉన్న తాను ఎటూపోలేక చనిపోయిన వారిలోనే లెక్కించు కున్నాడు గంగరాజం. సైన్యం రావడంతో ధైర్యం వచ్చింది. లింగమ్మ బతికి యింటికి చేరడం ఒక ఊరట. కానీ ఆ సంతోషం ఎంతోసేపు మిగల్లేదు. వారి భయానికి అరబ్బుల రజాకార్ల బాధపోయింది. కానీ వీరుచేసిన దోపిడీలు, మానభంగాలు, హత్యలు అంతకు మించి పోయాయి.

పారిపోయిన తాము పల్లె చేరినట్టు కొందరు దొరలు తిరిగి పల్లె చేరారు. గంగరాజం ఊళ్లన్నీ తిరిగి దొరలకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు. 1945 నుండి జగిత్యాల్లో, కోరుట్లలో చేనేత సహకార సంఘం నిర్మాణం కోసం ఎక్క లదేవి లక్ష్మణతో, దాసరి ఎతిరాజంతో కల్సి హకీం నారాయణదాసు నిజాం రాజవైద్యుడిని కల్సి నిజాంను కలిశారు. అలా చేనేత సహకార సంఘాలు స్థాపించి వెట్టి నిర్మూలనకు, సబ్సిడీ నూలుకు, ఖాదీ ఉద్యమానికీ కృషి చేశారు. దాని ఫలితంగానే 1952లో గంగుల భూమయ్య ఎమ్మెల్యేగా గెలవడం. గంగల భూమయ్య ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు తానే గెల్చి నంత సంతోషపడిపోయాడు గంగరాజం.

***

స్వాతంత్రం వచ్చింది. దొరల పెత్తనానికి గోరీ కట్టేశామనుకున్నారు. కానీ గోరీలోంచి తిరిగి కొత్త ఎత్తులతో దొరలు ముందుకు వచ్చారు. తమ జాతి ఉద్ధరణకు మొదలైన మెట్‌పెల్లి ఖాదీసంస్థ కూడా క్రమంగా విజయ రామారావు, చొక్కారావు వంటి దొరల పెత్తనంలోకి పోయింది. తెలుగు దేశం పార్టీ వచ్చేదాకా బీసీల నాయకత్వం అంటూ లేకుండా చేయ గలిగారు. ఎలా జరిగిందో చాపకింది నీరులాగా అంబల్ల రాజారాంను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ఏదో చేస్తాడను కుంటే తన కులం వారితో పాటు అందరితో 'దొర' అనిపించు కున్న అహంకారంతో అతనికీ గంగ రాజంకూ బెడిసికొట్టింది.

తాము బతుకుపోరులో ఎవరి గోచీ వాళ్ళు సర్దుకునే లోపే ఎంత చరిత్ర గడిచిపోయింది. తాను విజయరామారావును ఓడించి సర్‌పంచ్ అయితే అతడు ఆ తర్వాత పోటీచేసి ఎమ్మెల్యే అయ్యాడు. తనకు ఆర్థికంగా ఆ స్తోమత లేక పోటీచేయకుండా అక్కడే ఆగిపోయాడు గంగరాజం. అతనిలాంటి వాళ్లెందరో సర్ పంచులయ్యారు. కాని దొరలు, పోలీసు పటేలు, పట్వారీ ఒక్కటై అధికారుల్ని తమ చెప్పుచేతల్లో పెట్టుకొని తమకు అడు గడుగునా గోతులు తవ్వారు. గోతులు తవ్వే రాజకీయాలు తనకేనాడూ తెలియవు. తన పిల్లలు ఎదుగుతున్నారు. వారిని చదివించు కోవాలి అనుకున్నాడు గంగరాజం. వాళ్ల అవస రాలు తీర్చాలి అని నిశ్చయించుకొని వారికోసం జగిత్యాల్లో యిల్లు కిరాయికి తీసుకుని పిల్లలతో పాటు లింగమ్మనీ ఉంచి తానొక్కడు పల్లెలో ఉండిపోయాడు.


ఈ పోరాటాలు ఎన్నిచేసినా ఈ పల్లెబతుకుల్లో ప్రజా స్వామ్యం వచ్చేదాకా అవి బావిలో కప్ప బతుకులు కాక తప్పవు అని బతుకుపోరాటంలో పడ్డాడు. చెరు వులు, రోడ్లు కంట్రాక్టరయ్యాడు. లక్ష్మరాజంతో కల్సి తునికి ఆకు, ఎక్సైజు కాంట్రాక్టరయ్యాడు. ఆఫీ సుల చుట్టూ తిరగడానికి బస్సు సౌకర్యం ఉన్న ఊళ్ళో, తన పల్లెకు సమీపంలో ఉన్న కోరుట్లలో సెటిలయ్యాడు. కొడుకులకు ఉద్యోగాలయ్యాయి.

మేన సంబంధాలు ఎవరూ చేసుకోలేదు. సదువుకోని పిల్లను ససేమిరా చేసుకోన న్నారు. కనీసం అయిదవ తరగతైనా చదువుకుంటేనే చేసుకుంటామన్నారు. అట్లా లక్ష్మబాయి తమ యింటి కోడలైంది. లక్ష్మబాయి రాజేశంకు భార్య అయి కిరణ్మయి తల్లి అయ్యేసరికి తొమ్మిది గజాల గోచీ చీరనుండి ఆరు గజాల చీరకు మారింది. రాజేశం టీచరు పని నుండి లెక్చరర్ అయ్యేసరికి లక్ష్మబాయి ఆ స్థాయి మాటతీరు, సంస్కారం అలవర్చుకుని యిప్పుడు డిగ్రీ చదివిందేమో అనుకునేట్టు తయారైంది.

గంగరాజం చేనేత సహకార సంఘాల నిర్మాణంలో పడి తిరుగు తున్నప్పుడు రాజేశంకు కిరణ్మయిలాగే తొలుత పల్లెటూరులో పంతులు ఉద్యోగమే వచ్చింది. నేనా పల్లెటూరుకు పోను, బొంబాయి బట్టల మిల్లులో పనికి పోతానన్నాడు. బొంబాయిలో నూట యాభయి రూపాయల దాకా కూలీ గిట్టేది. టీచరు ఉద్యో గంలో నలభయి అయిదు రూపాయలే జీతం.

ఎక్కువ పైసలకు ఆశపడి బొంబాయి పోకు అంటూ లింగమ్మ ఏడ్చింది. లక్ష్మ బాయిని బొంబాయికి పంపనన్నారు అత్తమామలు. మెట్‌పల్లి ఖాదీ సంస్థలో ఉద్యోగం యిప్పించుమని రాజేశం పట్టుబట్టాడు. అప్పుడు అందులో టీచరుకన్నా ఎంతో ఎక్కువ జీతం ఉండేది.

అది దొరకకపోవడమే నయమైంది. దాంతో రాజేశం టీచరుగా ఎక్కి ఎమ్మే, పి.హెచ్.డీ. చేసి క్రమంగా లెక్చరరయ్యాడు. మెట్‌పల్లి ఖాదీలో చేరిన లింగమ్మ తమ్ముని కొడుక్కు రిటైరయ్యే వయస్సు నాటికి పేరుకు మేనేజరైనా అటెండరు స్థాయికి జీతం కుదించుకుపోయి మూడు వేలైనా రావడం లేదు. రాజేశం యిప్పుడు అయిందకెల జీతంకు చేరుకున్నాడు.



బొంబాయికి పోయిన వాళ్లే బాగుపడ్తారనుకున్న బతు కులు యిట్లా మారిపోతాయని ఎవరు కలగన్నారు. పల్లెల్లో వ్యవసాయం ఉన్నవాళ్ల బతుకులు యిట్లా అక్కడే ఆగిపోతాయని ఎవరనుకున్నారు. అప్పుడు వాళ్లకే బిర్రు ఎక్కువ.

ఒకప్పుడు పిల్లనిచ్చేకాడ ఎన్ని నాగండ్లు, ఎన్ని ఎడ్లు, ఎంత వ్యవసాయం, ఎన్ని మగ్గాలున్నాయని అడిగేవారు. ఇప్పుడదంతా పోయింది. ఏం చదువుకున్నాడు. ఏం ఉద్యోగం దొరుకుతుంది అనే అడుగుతారు. గంగరాజం తన చెల్లెలు సంగమ్మ పెండ్లికి ముప్పయి అయిదు రూపాయలకు తులం బంగారం కొన్నాడు. పెండ్లి పద హారు రోజులు జరిగింది.

పెండ్లికి నాలుగురోజుల ముందు చుట్టాలు యింటికి వచ్చేవారు. పోచమ్మకు చేసికొని గొర్రెపోతు కోసి మొక్కు చేయడంతో మొదలయ్యేవి చుట్టాల భోజనాలు. పెళ్లి భోజనాలు, మారుపెళ్లి భోజనాలు, వియ్యపు రాళ్ళ వైనం, పదహారు రోజుల పండగ అయినాక ఎవరింటికి వాళ్లు పోయేవాళ్లు. అందుకనే ఏ వ్యవసాయం పనులు లేకుండా ఎండా కాలం లోనే పెండ్లిల్లు పెట్టుకునేవారు. పెళ్ళికి ఎన్ని కచ్చ రాలతో చుట్టాలు వస్తారు అనేది వెనకటి లెక్క. పది కచ్చరాల్లో వందమందితో వెళ్తే చాలా పెద్దపెళ్ళి కిందలెక్క. రాజేశం పెండ్లికి అయిదు కచ్చరాలే ఎక్కువనిపిం చాయి గంగరాజంకు. ఇప్పుడు పెళ్ళి ఒక పూట పండుగగా కుదించుకుపోయింది. కిరణ్మయి మీటింగ్ పెళ్ళే చేసుకునేట్టుంది. ఈమె యిప్పుడు వెండి బంగారు నగలు కూడా మొరటు అంటుంది. ఓ చేతికి గడియారం తప్ప గాజులు కూడా వేసుకోదు. ఎవన్నో పట్టుకొని ప్రేమ అనుకుంటూ చెప్పకుండా లేచిపోయేట్టే వుంది కిరణ్మయి. రాజేశం టీచరుద్యోగం వచ్చాక పనిచేస్తున్న ఊళ్లో ఎవర్నో లేపుకొని ఉద్యోగం వది లేసి పారిపోదామనే చూశాడు. లింగమ్మ జాగ్రత్త పడ్డంతో కొడుకు బుద్ధిమంతు డయ్యాడు.

***

''ఏమాయె. ఊరొచ్చింది దిగు'' అని లింగమ్మ పిలవడంతో వర్తమానం లోకి వచ్చాడు గంగరాజం. బస్టాండు అల్లంత దూరాన బస్సాగింది. ఎక్కేవాళ్ళు పరు గున బస్సుకేసి వస్తున్నారు. బస్టాండులో ఆపకుండా యింత దూరాన ఆపడంతో గంగరాజం మనస్సు చివుక్కుమంది. ఈ బస్సుల కోసమేనా తాను పోరాటం చేసింది అని మనస్సు మూగ పోయింది.

''మనం ఈ వూరికి ప్రయివేటు బస్సు సర్వీసు కోసం ఎంత పోరాటం చేసి నమో గుర్తుందా!'' మెల్లిగా నడుస్తూ అడిగాడు గంగరాజం.

''ఎందుకు గుర్తులేదు. విజయరామారావు తన సవారి కచ్చురం పరువు పోయిందని, సర్వీసును బందు చేయించలేదా! ప్రయివేటు బస్సులో అందరూ తన తీరే కూర్చుండుడు సయించక పాయె. గిరాకి పెరిగినంక ఆ బస్సు బందు చేయించి తన బావతో బస్సు కొనిపిచ్చి నడి పించె. ఆ ఒక్క బస్సుతోని ముప్పయి బస్సులు కొనిరి. సిన్మా టాకీసు కట్టిరి. పట్నంల బంగ్లాలు కట్టిరి.'' లింగమ్మ కళ్ళముందే ఏమీలేని వాళ్లు ఎంత ఎదిగి పోయారో కోపంగా గుర్తుచేసుకొంది.

''నమస్కారం తాతా! ఇప్పుడేనా రాక! మనమరాల పెండ్లెప్పుడు'' అంటూ పలకరించాడు – టపా పంచుతున్న ఆ వూరి బ్రాంచి పోస్టుమాస్టరు.

''నమస్కారం. మీ నాన్న మంచిగున్నడా సేకరూ''.

''మంచిగనే ఉన్నడు తాతా! వాడకం కల్లు బింకి (కుండ) కోసం యిప్పుడే ఈదుల్లకు పోయిండు. ఎప్పుడూ నిన్నే యాది చేస్తడు తాతా! దొరలతోని కొట్లాడి ఊర్లె పోస్టాఫీసు పెట్టించి మా నాన్నకు యిప్పించింది నువ్వేనని పల్లెల అప్పుడు నువ్వుచేసిన పోరాటం గురించి ఎంతో యిదిగా చెప్తుంటడు''.

''ఏమో! యిప్పుడు అయింత యాది చేసుకునేటోల్లు ఎవలున్నరు. మరి మొన్న మీ నాన్న సి.సి. బ్యాంకు ఎలక్షన్లో విజయరాంరావు కొడుకుతోనే తిరిగిండట. కాలం ఎనుకకుపోతున్నదో ముందుకు పోతున్నదో తెలుస్త లేదు. అంత పోరాటంచేసి ఏం లాభం. ఎండ కొడ్తున్నది నడుస్త'' అంటూ ముందుకు కదిలాడు గంగరాజం.

అన్న వదినల్ని చూసి సంగమ్మ ముఖం సంతోషంతో వికసించింది. పూలు పండ్లు పెట్టడానికి పెద్దమనుషులు వచ్చి తీసుకుపోయే పాత ఆచారాన్ని పాటించా

డనుకుంది సంగమ్మ. మనమరాళ్లు కాళ్లకు నీళ్లిచ్చారు. సంగమ్మ కొసరికొసరి తినిపించింది. లింగమ్మ చాప మీద ఒరిగింది. గంగరాజం మంచంలో నడుం వాల్చాడు. చుట్టాలకు చెప్పడానికి ఊళ్ళోకి వెళ్లిన రెండో మనమడు అజయ్ సైకిల్‌పై వచ్చి వారిని పలకరించాడు. కుశల ప్రశ్నలయ్యాక అన్నాడు అజయ్.

''తాతా! బస్టాండుకు అంత దూరాన బస్సాపిన్రటగదనే. గీ బస్సులు కావాలని ఎనుకట పోరాటం చేసినవట. ఇప్పుడు ప్రయివేటు బస్సులే నయం. ఎక్కడంటే అక్కడ ఆపుతారు''.

''ఎనుకటి కాలం ఎట్లుండెనో నీకేం ఎరుకరా! ప్రయివేటు బస్సులు నడుపుకుంటు ఆర్టీసి బస్సులు రావద్దని, బస్సు డిపో పడవద్దని ప్రయత్నం చేసిరి. ఎంతో పోరాటం చేస్తే ఈ డిపో పడె. డిపో పడ్డంక డిపో వద్దన్న కొడుకులే డిపో మేనేజర్లయిరి. ఛైర్మెన్లయిరి. అంతా కండ్ల ముందటి పోరగాన్లు ఎట్లా ఎదిగిరి''.

''గా కండక్టరు పోస్టు యిప్పియ్యమంటే చాతగాలేదు గానీ అందరూ నా కండ్ల ముంగటి పోరగాన్లే అని మా అంటవులే'' అని అజయ్ హేళనగా అన్నాడు. గంగరాజంకు చాలాకోపం వచ్చింది. తమాయించుకుని అన్నాడు.

''నాకు యిష్టం లేకపోయినా నీకోసం అడిగితే పనీ గాకపాయె – నాకు అవమానం మిగిలె. అయినా మనం ఎప్పుడూ అడుక్కొంటూ, వాళ్ళేమో ఎప్పుడు అధికారంలోనే ఉండాల్నారా! నేను నీ వయసులో యిట్లా వాన్ని వీన్ని కాల్లు మొక్కుకుంటూ ఉంటే ఈ పల్లె యిట్లా అభివృద్ధి అయ్యేదేనా! ధైర్యం ఉంటే కొట్లాడురా! నా కాలంలో నేను సర్‌పంచ్‌నైనాను. నువ్వు మండలాధ్యక్షునివో, ఎమ్మెల్లేవో కారాదుర. దిక్కుమాలినట్టు అరబ్బు దేశాలకు పోతానని పైరవీ చెయ్యవడ్తివి. మీరు అరబ్బు దేశాలకు పోతే వాల్లు మీ పెండ్లాలకు అలవాటైతరు. ఏం పుటుకలురా మీవి. గింత రేషం లేని బతుకు. దేశం అమ్ముడుపోతుంటే ఒక్కడూ పోరాటం చెయ్యడేమిరా!''

అజయ్‌కు రేషం మొలుచుకొచ్చింది.

''ఈ దేశం నాకేమిచ్చిందని పోరాటం చెయ్యాలె తాతా! ఈ స్వాతంత్రం వల్ల, ఈ అభివృద్ధి వల్ల లాభపడ్డవాళ్ళు పోరాటం చెయ్యాలె. కనీసం కండక్టరు ఉద్యోగం యివ్వకుండా అరబ్బు దేశాలకు తరుముతున్న ఈ దేశం అమ్ముడుపోతే నేనెందుకు పోరాడాలి. దేశాన్ని అమ్ముక తింటే నా వాటా నాకు పారెయ్యమంటా, అంతే. ఈ దేశం ఏమైపోతే నాకేమిటి? మళ్ళీ విదేశీ పాలనలోకి పోతే ఎక్కువ సంతోషిస్తాను. నాకు లేని అభివృద్ధి, స్వాతంత్రం మిగతా వాళ్ళకెందుకుండాలి''.

హృదయంలో దెబ్బదగిలి విలవిలలాడిపోయాడు గంగరాజం. యువతరం ఆలోచనా తీరు చూసి అవాక్కయిపోయాడు. తేరుకొని ఏదో చెప్పబోయేంతలో ''నువ్వు వచ్చినట్లు చుట్టాలకు చెప్పి వస్తా'' అంటూ బయల్దేరాడు అజయ్.

''అన్నయ్య అన్నమాటలు పట్టించుకోకు తాతా. ఈ నడుమ అందరితోనీ యిట్లనే వాదన పెట్టుకుంటున్నడు'' అంటూ మనమరాల్లు తాతయ్యను అనునయించారు.

యాభయి ఏళ్ల అభివృద్ధిలో వీరికేమీ ఎందుకు అందకుండా పోయిందో ఏమీ లేని విజయరామారావు, అతని అత్తగారి తరపువాళ్లు ఎలా పడగలెత్తారో యిలా ఎందుకుజరిగిందో ఆలోచనలో పడ్డాడు గంగరాజం. అజయ్ తండ్రి శంకరయ్య చిన్న తప్పు చేయడం వల్ల నలభయి ఏళ్లుగా ఆ నష్టం ఎట్లా పెరుగుతూ పోయిందో! 1960లో హెచ్చెస్సీ ఫేలయ్యాక జగిత్యాల్లో ఈజీబిటి టీచర్ ట్రేనింగ్ చెయ్యిరా అంటే వినకపోయె. రెండేండ్లు ట్రేనింగ్ చేసి పాసైతే జీతం అరవై రూపాయలుండదు. బొంబాయిలో బట్టలమిల్లుల్లో నెలకు రెండు వందల రూపాయలు గిట్టుబాటవుతాయని పోయాడు. బొంబాయిలో కూలీలు తగ్గుతూ వచ్చాయి. టీచర్లకు జీతాలు పెరుగుతూపోయాయి. ఇలా జరుగు తుందని ఎవరు కలగన్నారు. తానైనా ప్రయివేటు బస్సు కొనే ధైర్యం చేశాడా! ఆ చిక్కులు వద్దనుకోలేదా!

ప్రావిడెంటు ఫండుకోసం పనికే పర్మనెంటుగా రాజీనామా చేశాడు శంకరయ్య. వచ్చిన పైసల్తో నాలుగెకరాలు కొన్నాడు. కాని వ్యవసాయానికి పైసలు అవసరం కావడంతో భీవండికి వలస వెళ్లాడు. ఏడాదిన్నర దత్తా సామంత్ సమ్మెతో భీవండిలో నిరుద్యోగ కార్మికుల ఒత్తిడి పెరిగింది. కూలీ తరిగింది.

ఏడాదికోసారి రావడం శుక్రవారం పూజలు, తాగుడు, సంపాదించిదాన్లో ఎంతో వృధా కావడం, ఇక్కడ సంగమ్మా, కోడలు ఎండనకా, వాననకా కష్టపడి పొలాలు పండించడం. శంకరయ్య వయస్సు పెరిగి ఆరోగ్యం బాగుండక భీవండి బందయ్యాడు.

శంకరయ్య యిప్పుడు మరీ పేదవాడేమీకాదు. పిల్లలకు చదువు తాలూకు సంస్కృతి అందకుండా పోయింది. బొంబాయి కార్మిక సంస్కృతి పల్లెకు పనికి రాలేదు. పల్లె సంస్కృతికి వాళ్లు ఒదిగిపోలేదు. రెంటికీ మధ్యస్తంగా ఎదిగిన నలభయి ఏళ్ళ జీవితక్రమం మేనల్లుడిది. వడదెబ్బకు అకస్మాత్తుగా పోయాడు. అప్పటికే మేనల్లుడి పెద్దకొడుకు విజయ్ ఎదిగి వచ్చాడు. కిరణ్మయి అంతచదువూ చదివాడు. పల్లెలోనే స్కూలు నడుపుకుంటున్నాడు. ఉద్యోగం మీద ఆసక్తి లేదు. రాజకీయాల్లో దిగాలని ఉన్నట్టుంది. భార్య ఉద్యోగం చేస్తూ ఉంటే తాను ఆర్థికంగా ఎవరిపై ఆధారపడనవసరం లేకుండానే రాజకీయాల్లో ఎదగవచ్చునని అతని ఉద్దేశం. తాను చేయలేకపోయిన కర్తవ్యాల్ని విజయ్ అందుకుని ముందుకుసాగుతాడని ఆశ

కవిత




## సూర్యుడు మండే రాత్రి

స్వప్నాల్ని నిజం చేసుకుంటూ
మనసులోని భావాల్ని ఆలోచనల్లోనే దాచుకుంటూ
ఇంద్రియాల్ని సువాసనల తోటలోనే చంపుకుంటూ
దుర్గంధపు జీవితంలో మనసుని కాల్చుకుంటూ
ఎండిపోయిన చెట్టులా ఎప్పుడు కూలిపోతానా
అని ఆలోచిస్తూ ప్రకృతిని ప్రార్థిస్తూ
తపస్సులో తరిస్తూ ఉంటా
అవయవాలన్నీ అరిగిపోయి ఎన్నో జన్మల వెనుక
దొరికిన అవశేషాల్లా మొరపెడుతూ ఉంటే
అనాదిగా ఆశపెడుతూ వస్తున్న కలలు కల్లలై
దృశ్యాలు ప్రాణం కోల్పోతున్న బొమ్మల్లా కనిపిస్తుంటే
ఉబికి వస్తున్న కన్నీళ్లు భాస్వరజలాలై మండుతుంటే
కన్నీటి గ్రంధుల్ని పీకి పారబోసి అంధుడినై నవ్వుతూ ఉంటా
గాయాలతో ఉన్న గాయాన్ని మాటల శూలాలు కసుక్కున
గుచ్చుకుంటూ ఉంటే శబ్దవేదితో కర్ణభేరిని తెంపుకుని
నిశ్శబ్దంలో నిశ్చలంగా మునిగిపోతూ ఉంటా
వేధిస్తే గాని శాంతించని లోచనలేవో మనసుని కెలికేస్తూ ఉంటే
అవే ఈశ్వర ప్రకంపనలనుకుంటూ ఈశ్వరతత్వంలో జీవనం
కొనసాగిస్తూ ఉంటా
కాలాల శిక్షల్లో క్షణక్షణం నరకమే కనిపిస్తూ ఉంటే
నరకాన్ని స్వర్గానికి ఉరితీసి కాలాన్ని నేనే శిక్షిస్తూ ఉంటా
మనిషిని గదా అని నేను శిక్షార్హుడినని మనసుని రాగం చేసి
పంజరంలో బంధించి ఆనందింప చేయమంటే
పలుకులే రాని నేను పాటలెలా పాడగలను
నేత రానివాడ్ని నేర్పు తెలియనివాడ్ని ఆకాశాన్ని
వస్త్రంగా  నేసి నెలవంకని  తెచ్చి హారంగా వేసి సుంకంగా
చెల్లించమంటే ఎలా కట్టగలను
పక్షులకి రెక్కలున్నాయని నా రెక్కల్ని లేఖలుగా ఎగరేసి
గాలిని బంగారు పోతగా పోసి కానుకగా
ఇవ్వమంటే ఎలా ఇవ్వగలను
నేను వెతుక్కునే వెన్నెల రాత్రి కాళరాత్రై కన్నెర్ర చేస్తుంటే
నా చూపుల్ని నేలలో పాతిపెట్టకుండా
ధ్యానానికి లొంగిపోకుండా ఎలా ఉండగలను
ప్రాణం ప్రాణాన్ని పూర్తిగా మింగేస్తూ ఉంటే
ప్రాణంతోనే సమాధి కాకుండా ఎలా మిగలగలను
సుషుప్తిని ఆవహించుకోకుండా ఉభయచరంలా
బ్రతకకుండా ఎలా జీవించగలను

–జాస్తి రామకృష్ణ చౌదరి
9246346639

కలగడంతో కిరణ్మయిని ఎలాగోలా వొప్పించాడు. రేపు మంత్రి భార్యగా కలిగే యోగాన్ని కావాలని కిరణ్మయి కాలదన్నుకుంటోంది. ఎవరికి తెల్సు. రాజకీయాలు అకస్మాత్తుగా తిరగ బడి విజయ్‌కు బదులు విజయ్ భార్యగా కిరణ్మయే మంత్రి కావచ్చు. అభివృద్ధి ప్రవాహానికి నలభయి ఏళ్లక్రితం శంకరయ్య చేసిన పొరపాటుతో దూరమ్మైన తన చెల్లెలి కుటుంబాన్ని, తన కొడుకు కుటుంబాన్ని ఒకే ప్రధాన ప్రవాహంలోకి తేవాలని చేయాలనుకుని నిశ్చయించేసిన పెళ్లి కిరణ్మయి మూర్ఖపు పట్టుదలతో విచ్ఛిన్నం అవుతోంది. గంగరాజం నిస్సహాయంగా తల కొట్టుకున్నాడు.

కిరణ్మయి తనను స్వార్థపరుడని అన్నది. సమాజ అభివృద్ధికోసం పని చేస్తూ తన బతుకుతాను బతకడం నేరమా! గుంటుక నర్సయ్య పంతులు తన జీవితాన్ని చేనేత ఉద్యమానికే అంకితం చేస్తే సంగం పైసలు తినమరిగాడని, సంపాయించలేక సంగం అంటున్నాడని ఎన్ని మాటలన్నారు. దాంతో బట్టల వ్యాపారం చేసి సంపాదించి తిరిగి సంగానికి పెట్టడం వల్లనే కదా చేనేతోద్యమ పితామహుడని గౌరవించింది. తాను జనం మీద ఆధారపడి బతికితే పైరవీకారు అని నిందలేసే వారు కాదా! కిరణ్మయి ఎంత తప్పుగా ఆలోచిస్తోంది. తాను కష్టపడకపోతే రాజేశం లెక్చరరై కిరణ్మయికి ఈ అభివృద్ధి అందడం సాధ్యమయ్యేదేనా!

స్వార్థం తనదా, కిరణ్మయిదా! యిక్కడ పల్లెలో యింట్లో పశువులు, కోళ్లు, రొచ్చు పేడ, వ్యవసాయం, సంస్కృతి కిరణ్మయికి భరించరానిదిగా ఉంది. ఈ వ్యవసాయమే లేకపోతే దేశంలో పాడీపంటలు ఎక్కడివి. అన్నీ తెల్సీ కిరణ్మయి ఏమన్నది.

''తాతయ్యా! పల్లెలు ఫొటోల్లో బాగుంటాయి. చూడ్డానికి బాగుంటాయి. ఉండడానికి బాగుండవు. పట్నంలో ఉంటూ పల్లెలు అద్భుతమ్మైనవని నేనూ కథలు, వ్యాసాలు రాస్తాను. పట్నాల్లో సకల సౌకర్యాలున్న యిళ్ళల్లో, అపార్టుమెంటుల్లో, స్వర్గంలాంటి కాలనీల్లో ఉంటూ అభివృద్ధి ఫలాలన్నీ పోటీపడి ముందు లాగేసుకుని పైకి మళ్ళీ పల్లెలు బాగుంటాయి అని వాదించేవాళ్లను ముందుగా షూట్ చేయాలి తాతయ్యా!'' కిరణ్మయి అన్నప్పుడు యువతరం ఆలోచనా తీరుకు వణికి పోయాడు తాను. ''అయిదు నిమిషాలు కరెంటు పోతే అబ్బ ఉక్కపోత - వెధవ బతుకు వెధవ ప్రభుత్వాలు అని తిట్టిపోసే మహానుభావులే పల్లెలు బాగుంటాయని అంటార''ని కిరణ్మయి నిశ్చితాభిప్రాయం.

''తాతయ్యా! పల్లెటూరి మనస్తత్వాలు యిప్పటికీ క్రూరమ్మైన ఫ్యూడల్ మనస్తత్వాలే. ప్రజాస్వామిక వ్యవస్థ వేళ్ళూనుకోకుండా ప్రజాస్వామిక సంస్కృతి పల్లెల్లో ఎదిగే అవకాశం లేదు. అంతదాకా యివే కుత్సితపు మనస్తత్వాలు - ఓర్వలేనితనం. కాస్త వరసైతేచాలు వయస్సు ఆధిక్యతతో ఏమే, ఓసే అని పిలుస్తారు. ఇంట్లో లెట్రిన్ ఉండదు. అదే చెరువులో స్నానాలు, అదే చెరువులో చాకిరేవులు, అదే చెరువులో కాలకృత్యాలు''.

''తాతయ్యా! పల్లెల్లో ఏదో ఒక కులానికో, యింటికో పరిమితం చేసి నన్ను ఫలానా కులం అమ్మాయి, ఫలానా యింటికోడలు అని చూస్తారే తప్ప వ్యక్తిగా నా వ్యక్తిత్వాన్ని, తెలివితేటల్ని, జ్ఞానాన్ని అప్రధానం చేసి చూస్తారు. నన్ను ఎవరికో మనమరాలుగా, కూతురుగా, కోడలుగా, భార్యగా చూసి గౌరవించడం అంటే నాకు అసహ్యం. నన్ను నన్నుగా గౌరవించాలి. అది పల్లెల్లో సాధ్యం కాదు'' కిరణ్మయి యింకా ఎన్ని అన్నదో...

కిరణ్మయి అన్న మాటలతో గంగరాజం యిప్పుడు కొత్తగా ఆలోచనలో పడ్డాడు.

''చిన్నాయిన ఎప్పుడస్తివే'' అంటూ కుమ్మరి రాజయ్య రావడంతో సగం సగం నిద్ర, సగం కల వంటి స్థితి నుండి లేచి కూర్చున్నాడు గంగరాజం.

''అంతా మంచిదేనా రాజన్నా! కొడుకులు మంచిగ అర్సుకుంటున్నరా. ముసల్ది పోయినంక నీకు ఎంత గోసకాట్టె'' సానుభూతిగా పలకరించాడు.

''చిన్నాయిన్నా! ఏంచెప్పాలె. కొడుకులు వేరుపడి నేను సంపాదించిం దంత పంచుకొని యిప్పుడు ఎవడు పెడ్తలేడు. నువ్వే చెప్పాలె వాల్లకు'' అంటూ విషయమంతా వివరించాడు రాజయ్య. అంతా ఓపికగా విని నిట్టూరుస్తూ అన్నాడు గంగరాజం.

''ఇప్పుడు నాకా ఓపికలేదు. ఎవరిది వారికే భారతమంతయి పోయింది. నా మనుమలు మనమరాండ్లే నా మాట దేకుతలేరు. అంతా నా కోసమే చేసుకున్ననట'' అంటూ చెప్పుకొన్నాడు గంగరాజం.

ఎవరెవరో పలకరించడానికి రావడంతో కుమ్మరి రాజయ్య సెలవు తీసుకు


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్స్ : 040-23747777 , 9391999999



FREE online Registration &
Free search
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | |
|---|---|
| అమీర్‌పేట్ | నెల్లూరు |
| కూకట్‌పల్లి | తిరుపతి |
| దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు |
| విజయవాడ | (చెన్నయ్) టి.నగర్ |
| గుంటూరు | బెంగుళూర్ |
| తెనాలి | సేలం |
| విశాఖపట్నం | మధురై |
| రాజమండ్రి | వెల్లూరు |
| కాకినాడ | తిరుచి |
| ఖమ్మం | పాండిచ్చేరి |
| ఒంగోలు | ఈరోడ్ |
| | ఏలూరు |

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.


న్నాడు. సంగమ్మ కోడలుతో కల్సి రాబోయే చుట్టాల కోసం వంటల ఏర్పాటుచేస్తోంది. అజయ్ రెండు కుండల కల్లు పట్టించుక వచ్చాడు. మక్కలు, అనుములు కలిపి పోసిన గుడాలు (గుగ్గిళ్ళు), చికెన్ పులుసు వాసన కలగల్సి కమ్మని పండుగ వాతావరణం తలపిస్తోంది.

ఊళ్ళు తిరిగి చుట్టాలకు చెప్పిరాను పోయిన పెళ్ళికొడుకు విజయ్ వచ్చేసరికి చుట్టాలతో యిల్లు నిండిపోయింది. పూలు పండ్లు పెట్టే కార్య క్రమంతో పాటు ఆ సంబంధం క్యాన్సిల్ అయిందని తెలిసి అవమానంతో బాగా కుంగిపోయాడు. కానీ వారికదేమీ పెద్దగా పట్టినట్టులేదు. ఎక్కడెక్కడో తిరిగి రాత్రికి చేరవచ్చాడు విజయ్. అప్పటికి భోజనాలు పూర్తయి యాభయి ఏళ్ళనాటి సంగతులన్నీ ముచ్చటిస్తున్నారు. ఇంగ్లీషు మీడియం చదివిన ఆడపిల్లలు ఈ పల్లెల్లో ఉంటారనుకొని ఖాయం చేసుడే తప్పసలు. పెళ్ళిపత్రికలు అచ్చేశాక అనలేదు నయం అని కిరణ్మయినే మెచ్చుకుంటున్నారు.

ఆ రాత్రే యిల్లు చేరిన రాజేశం కూతురు చేసిన పనికి మొహం చెల్లక యింటి వద్దే ఉండిపోయాడు. ముసలి దంపతులు తెల్లవారి ఇల్లు చేరేసరికి రాజేశం వారి కోసమే ఎదురుచూస్తూ ఉన్నాడు. ముఖం చాటువేయడానికి కిరణ్మయి ఎప్పటిలా స్కూలుకు వెళ్ళిపోయింది.

''విజయ్ యిక జీవితంలో పెళ్ళేచేసుకోడట'' అన్నాడు గంగరాజం. కోడలు లక్ష్మిబాయి సానుభూతి చూపే బదులు కూతురును వెనకేసు కొచ్చింది.

''ఆడపిల్లను మగవాల్లు పీటలమీది పెళ్ళిళ్ళు ఎత్తగొట్టవచ్చు! ఏవో వంకలు పెట్టి చూడవచ్చేవాడల్లా అంటుంటే ఆడపిల్లలకు ఎంత అవమానంగా ఉండాలె. ఒక్కసారి మొగాన్ని ఆడపిల్ల వద్దని నిరాకరిస్తే యింత పౌరుషమా! అయితే గానీ'' అని జాడించింది లక్ష్మిబాయి.

❑

*-రచన, 1999*